## తండ్రి మరణం మరువకముందే..

# మరో విషాదం

### ఏడాదిలోనే తండ్రి, తనయ మృతితో శోకసంద్రంలో కుటుంబం

- కన్నీరుమున్నీరైన బంధువులు, అనుచరులు, బీఆర్ఎస్ కార్యకర్తలు
- ప్రమాద ఘటనను తలుచుకొని తల్లడిల్లిన నియోజకవర్గ ప్రజలు


ఎమ్మెల్యే లాస్యనందిత అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన అభిమానులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు

కంటోన్మెంట్ బీఆర్ఎస్ యువ ఎమ్మెల్యే జి.లాస్యనందిత ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోయారు. కుటుంబ సభ్యులు, బంధువులు, నియోజకవర్గ ప్రజలు, పార్టీ కార్యకర్తలు కన్నీరుమున్నీరయ్యారు. ఎమ్మెలే లాస్యనందిత తండ్రి ఎమ్మెల్యే జి.సాయన్న గత ఏడాది అనారోగ్యంతో అస్తమించారు. ఆ విషయం మరువకముందే శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లాస్యనందిత మృతిచెందిన విషాదకర ఘటనను తలుచుకొని ప్రజలు, అభిమానులు కన్నీటి పర్యంతమయ్యారు. చిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా ఎన్నికై ఎంతో రాజకీయ భవిష్యత్తు ఉన్న లాస్య అనంత లోకాలకు వెళ్లిందంటూ రోదించారు. లాస్య భౌతికకాయానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నివాళులర్పించారు.


భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత


భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు గోపాల్, వెంకటేశ్


ఎమ్మెల్యే లాస్యనందితకు వీడ్కోలు పలుకుతున్న మహిళ


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌రావు


భౌతికకాయం వద్ద కుటుంబ సభ్యుల రోదనలు

## ఎమ్మెల్యే లాస్యనందిత మృతదేహానికి డిప్యూటీ మేయర్ నివాళి


లాస్యనందిత మృతదేహానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి దంపతులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 23: రోడ్డుప్రమాదంలో మృతి చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత పార్థివ దేహానికి నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. చిన్న వయసులోనే లాస్యనందిత ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు సేవచేసే క్రమంలో అకస్మాత్తుగా మృతి చెందడం బాధాకరమన్నారు.

### సంతాపం తెలిపిన సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు

ఎమ్మెల్యే లాస్యనందిత మరణించడం పట్ల సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆమె మృతి బాధాకరమని అన్నారు. చిన్నవయసులోనే ఆమెను కోల్పోవడం విచారకరమన్నారు. సాయన్న కుమార్తెగా ఆమె ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. కార్పొరేటర్‌గా పనిచేసిన కాలంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఎంతో చొరవ చూపేవారన్నారు.

## పార్కుల అభివృద్ధికి చర్యలు


నేతాజీ పార్కు ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న 9వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి

మణికొండ, ఫిబ్రవరి 23: పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మణికొండ మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి అన్నారు. నేతాజీ పార్కులో ప్రహరీ పునరుద్ధరణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రహరీ కూలిపోవడంతో కొంత కాలంగా పార్కు పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. కొన్ని మరమ్మతు పనులను సైతం యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నామని చెప్పారు. నిర్మాణ సమయంలో పార్కుకు వచ్చే వారు అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వి.బాల్‌రెడ్డి పాల్గొన్నారు.


వైజ్ఞానిక సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న విజ్ఞాన దర్శిని, విద్యార్థి సంఘాల నాయకులు

## 29న ఓయూలో వైజ్ఞానిక సభ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 23: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విజ్ఞాన దర్శిని, వివిధ విద్యార్థి సంఘాలు సంయుక్తంగా ఉస్మానియా యూనివర్సిటీలో వైజ్ఞానిక సభను నిర్వహించనున్నాయి. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ.. ఏ దేశమైనా సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి ద్వారానే పురోగతి సాధ్యమని అన్నారు. దేశంలో మనువాద పాలకులు సైన్స్, వైజ్ఞానిక దృక్పథాన్ని దెబ్బతీస్తూ మూఢత్వాన్ని పెంపొందించే చర్యలకు దిగుతున్నారని మండిపడ్డారు. సైన్స్ రంగాలకు నిధుల కోత విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోమూత్రం, పురాణాల పేరు చెప్పి ప్రజల్లో మూఢత్వాన్ని పెంపొందించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సైన్స్ కోసం ఎన్నో త్యాగాలు చేసి, మానవ జీవన గమనాన్ని మలుపుతిప్పిన శాస్త్రవేత్తలు పలువురు జన్మించిన ఫిబ్రవరిలోనే జాతీయ సైన్స్ దినోత్సవం కూడా ఉందని చెప్పారు. అందుకే ఈనెలలో సైన్స్ మాసోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజ్ఞానయానం పేరుతో తెలంగాణలోని ఇరవై జిల్లాల్లో 50 విద్యాసంస్థల్లో 25 వేల మంది విద్యార్థులు, యువతకు వైజ్ఞానిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. ఈ విజ్ఞానయానం ముగింపు సందర్భంగా ఈ నెల 29న ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో వైజ్ఞానిక సభను నిర్వహించనున్నట్లు చెప్పారు. సభకు మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన దర్శిని కోర్ టీం సభ్యురాలు శోభారాణి, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, అంసా తదితర సంఘాల నాయకులు నాగేశ్వర్‌రావు, రవినాయక్, నెల్లి సత్య, సుమంత్, నామ సైదులు, ఉదయ్‌కుమార్, శ్రీకాంత్, రామటెంకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక మెళకువలు అందిపుచ్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్యామిశ్ర

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 23:వెస్ట్ మారేడ్‌పల్లి విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ డిగ్రీ కళాశాలలో 'సాకేంతిక యుగంలో మహిళా పారిశ్రామికవేత్తల సాధికారిత' అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్యామిశ్ర హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. సాంకేతిక యుగంలో మహిళా పారిశ్రామికవేత్తలు బహుళ అవకాశాలను పొందుతూనే.. సమస్యలను కూడా ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనికి పరిష్కారంగా వారిని సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దాలని వివరించారు. కళాశాల కార్యదర్శి శేషగిరిరావు మాట్లాడుతూ.. రాబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ముందుగానే పారిశ్రామికవేత్తల సాధికారిత పై జాతీయ సదస్సు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వి.రాజశేఖర్, ముఖ్యకార్యదర్శి డాక్టర్ డీఎన్ రావు, విజ్ఞాన జ్యోతి సంస్థ అధ్యక్షుడు డి.సురేశ్‌బాబు, విజయప్రసాద్, కళాశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

## పెండింగ్ పనులను ప్రారంభించాలి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 23:జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని పెండింగ్ అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతిని కలిసి పెండింగ్ పనులు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. ఫిలింనగర్‌లోని దీన్ దయాళ్‌నగర్ బస్తీనుంచి ఏబీఎన్ చానల్ దాకా సీసీ రోడ్డు పనులను ప్రారంభించాలని, డివిజన్‌లోని ఇతర బస్తీల్లో మంజూరైన సీసీ రోడ్డు పనులను చేపట్టాలని కోరారు. దీనికి స్పందించిన డీఎంసీ ప్రశాంతి త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పనిచేస్తున్న సంస్థకే టోకరా..

బంజారాహిల్స్, ఫిబ్రవరి 23: పనిచేస్తున్న సంస్థకే టోకరా వేసి ఉడాయించిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... జూబ్లీహిల్స్ రోడ్ నం.36లోని కేవీఆర్ హోల్డింగ్ సంస్థలో సికింద్రాబాద్‌లోని పార్శిగుట్టకు చెందిన హేమంత్ అనే యువకుడు నాలుగునెలలుగా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 19న సంస్థకు చెందిన రూ.2.45 లక్షల నగదు, హీరో ఎలక్ట్రిక్ స్కూటర్‌తో హేమంత్ ఉడాయించాడు. ఫోన్ చేయగా రూ.75వేలు పంపించి స్విచ్చాఫ్ చేసుకున్నాడు. దీంతో హేమంత్‌పై మేనేజర్ హరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్: నిషేధిత సిగరెట్లను విక్రయిస్తున్న కిరాణాషాపు నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసు ల కథనం ప్రకారం... కృష్ణానగర్ బీ బ్లాక్‌లోని శ్రీ సాయి నర్సింహ కిరాణా అండ్ జనరల్ స్టోర్‌లో గత కొంతకాలంగా పలు బ్రాండ్‌లకు చెందిన నిషేధిత సిగరెట్లను విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. పలు బ్రాండ్లకు చెందిన రూ.56వేల సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. షాపు నిర్వాహకుడు ఏ.సాయిబాబాపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# 'గాంధీ'లో డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తాం

### మంత్రి కోమటిరెడ్డి

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 23: గాంధీ దవాఖానలో డ్రైనేజీ లీకేజీ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మరణించిన సందర్భంగా శుక్రవారం ఆయన సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానాకు వచ్చారు. అదే సమయంలో భవనంపై నుంచి డ్రైనేజీ లీకేజీలను గమనించారు. దానిపై గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావుతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గాంధీ దవాఖాన నిర్మించి 20 ఏండ్లు పూర్తి అయ్యిందని, పాత పైపులైన్లు శిథిలావస్థకు చేరాయని అన్నారు. గత ప్రభుత్వం ఇందుకోసం రూ.14.80 కోట్ల నిధులను మంజూరు చేసిందని, టెండర్లను ఆహ్వానించినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు మొదలుకాలేదని తెలిపారు. ఈలోగా ఎన్నికలు రావడంతో కొంత జాప్యం నెలకొన్నదన్నారు. కొత్తగా ఏర్పడిన తమ ప్రభుత్వం విద్యా, వైద్య రంగాల అభివృద్ధి కోసం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని, త్వరలో సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి, ఇంజినీరింగ్ విభాగం అధికారులను పంపించి డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నివేదికను కోరతామని అన్నారు. ప్రతి రోజు నాలుగు వేల మంది పేదలు వచ్చిపోయే గాంధీ దవాఖానలో సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గాంధీ దవాఖానలో లీకేజీ అవుతున్న డ్రైనేజీ పైపులు



## విద్యుత్ సమస్యలపై తక్షణం స్పందించాలి


బేగంపేట్‌లో జరిగిన విద్యుత్ ఉద్యోగుల సమావేశానికి హాజరైన అధికారులు, సిబ్బంది

బేగంపేట్, ఫిబ్రవరి 23: ప్రజల నుంచి విద్యుత్ సమస్యలపై వచ్చే ఫోన్ కాల్స్‌పై తక్షణమే స్పందించాలని టీఎస్‌పీసీడీసీఎల్ గ్రీన్ ల్యాండ్స్ డివిజనల్ ఇంజినీర్ సుధీర్‌కుమార్ అన్నారు. శుక్రవారం బేగంపేట్ పాత ఎయిర్‌పోర్ట్ సమీపంలో జరిగిన విద్యుత్ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో అలక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. లోవోల్టేజీ సమస్యలు రాకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని, కొత్త లైన్లను వేయడానికి ప్రణాళికను రూపొందించాలని కోరారు.

## క్రైస్తవులపై దాడులను అరికట్టాలి

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 23: క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ పలువురు క్రైస్తవ సంఘాల నాయకులు సీఎం సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ భరత్‌రెడ్డి, జాన్‌కెనెడి, భారత క్రిస్టియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ముల్కల భాస్కర్ క్రైస్తవుల సమస్యలను గురించి ఆయనకు వివరించారు. జన్వాడ గ్రామంలో చర్చి ముందున్న రోడ్డు విషయంతో కొంత మంది చర్చి లోపలికి వెళ్లి ధ్వంసం చేయడంతో పాటు క్రైస్తవుల పై దాడి చేశారని ముల్కల భాస్కర్ తెలిపారు. క్రైస్తవుల పై అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపించారని చెప్పారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా బలమైన చట్టాలు తీసుకురావాలని కోరారు. అలాగే ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీని కూడా కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత క్రైస్తవ దండోరా నాయకులు కాశీసతీశ్, పీటర్, ముల్కల భాస్కర్ సరోజ, ఏస్తేరు రాణి, పాస్టర్లు పాల్గొన్నారు.




మహంకాళి అమ్మవారికి గాజులతో అలంకరణ ,కోటి కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న మహిళ భక్తులు

### మహంకాళి అమ్మవారికి

## గాజులతో అలంకరణ

బేగంపేట్ ఫిబ్రవరి 23: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో కోటి కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం మహిళా భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించారు. మహంకాళి అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్టు ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. మహిళా భక్తులు అమ్మవారికి సుహాసిని పూజలు నిర్వహించారు. విశ్వశాంతి లోకకల్యాణార్థం ప్రతియేటా ఈ పూజలను నిర్వహిస్తున్నామని ఈవో తెలిపారు. ఈ నెల 24 వరకు పూజలు జరుగుతాయని, 24న అన్ని రకాల స్వీట్స్‌తో అమ్మవారికి అలంకరణ ఉంటుందని అలాగే శాంతి హోమం, పూర్ణాహుతితో పూజలు ముగుస్తాయని వారు తెలిపారు.

**BEFORE THE TELANGANA STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION AT HYDERABAD.**
**F.A. I.A. No. 1820/2022 against C.C. No. 379/2019**
**DCDRC-II HYDERABAD**
The Divisional Manager, National Insurance Co. Ltd., Divisional Office IV, No. 16, Kumara Krupa Road, Shivananda Circle, Bangolore -560 001, Rep. by its Authorised Signatory, NIC, HRO, Hyderabad-500 001. **...Petitioner/ Appellant**
**And**
Bandari Pushpa, W/o. late Kistaiah, Aged 55 years, Occ: House Wife, R/o. Balamarai, Anna Nagar, Secunderabad, Hyderabad-500023.
**....Complainant/Respondent**
**NOTICE TO COMPLAINANT / RESPONDENT**
Please take Notice that the above appeal filed by Opposite Party - The Divisional Manager, National Insurance Co. Ltd., Divisional Office IV, No. 16, Kumara Krupa Road, Shivananda Circle, Bangolore -560 001, Rep. by its Authorised Signatory, NIC, HRO, Hyderabad-500 001 stands posted to 04-03-2024 at 10.30 am as per orders in I.A. No. 803/22 Dt: 04-03-2024 before the above Hon'ble Court for your appearance and counter if any. Should you fail to appear and file a counter; the matter will be heard and decided in your absence basing on the material available on record.
**// BY ORDER OF THE COURT //**
**M/s G. KOTESWARA RAO**
AIII, PGADR, PGDCA, MA, LLM, Advocate
Gate No. 12, Flat No. 405, Chitra Layout, Besides RR Dist. Courts, LB Nagar, Hyderabad-500 068.